## మినీ కథ:

# జాలికథ



యన్నంరెడ్డి వెంకటరెడ్డి

హడావిడి, అంతా కోలాహలం!

ఆ పల్లె - పట్నం ముసుగేసుకోవాలని "యమ" ఆరాటపడుతోంది ! అందుకు ఆ ఊరి పెద్దలు "చచ్చే" హుషారుతో సాయం చేస్తున్నారు.

ఫర్లాంగు ఫరాంగుకీ అర్చిలు కట్టి, వాటి మధ్యన "పార్టీ" జండాలు వేలాడగట్టేరు.

రకరకాల ఆర్చులతో, రంగు రంగుల డిజైన్లు కట్టేరు.

అక్కడక్కడ అరటి చెట్లు కృత్రిమంగా వెలిశాయి.

రాటరాటకీ కొబ్బరి రెమ్మల్ని అలంకారంగా పాతేశారు.

ఉపన్యాస వేదిక ప్రక్కల రంగు రంగుల కట్టెన్లు పైన షామియానా....

రోడ్డుల గోతులు పూడ్చేరు.

ఊరంతనీ ఊడ్చేరు !

తాటాకు చుట్టిల్లు కొంపలకి సున్నాలు వేయించుకోమన్నారు- ఊరి పెద్దలు ! వేయించుకుని, 'అమాత్య శేఖరులు. అమృత హృదయులు, అన్నార్తుల పెన్నిధీ అయిన శ్రీశ్రీశ్రీ.... గారికి జై....' అని రాయించుకోమన్నారు- పెద్దలు !

ఉన్నంతలో ఊరు అందంగానే తయారయింది. కానీ, అంత చేసినా ఆ ఊరి పెద్దవారికి తృప్తినివ్వలేకపోయింది.

రాజగోపాలపురాన్ని రాజమహేంద్రమంత చేయలేకపోయామనే వాపోయేరు !

మంత్రి మహాశయులు- ఆ పల్లెకు వేంచేసి- ఆ ఊరి పెద్దల విస్తళ్లో భోంచేసి- వారికి తృప్తినిద్దామన్న బృహత్తర 'ఆశ'యంతో వస్తోన్నారు !

పల్లీయులు జరుగుతున్న వింత తతంగాన్ని చూస్తూ విస్తుపోతోన్నారు.

'ఏటి?మనూరికి యింతందముందేటి?' అనుకుని. ఆశ్చర్యపోయేరు.

మొగోళ్ళ- గోసెలు పీకేసి దోవతులు కట్టుకున్నారు !

ఆడోళ్ళ- 'కచ్చాలు' తీసేసి చీరలు చుట్టుకున్నారు !!

మొత్తమ్మీద పల్లీయులంతా ఉతికిన బట్టల్తో వున్నారు.

'రామ కోవెల' రమణీయమైన రంగులు పులుముకుని,జండా కాయితాలను అంటించుకుంది !

ఆ కోవెల్లో ముచ్చట్లాడుకుంటున్న కొందరికి - "బుయ్యన".... మంత్రిగారి రాక సూచనగా.... కాదనుకుంటా. రక్షణగా ఓ పైలట్ వెళ్ళి పల్లీయుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

అసలు మోటారు చప్పుడే ఊహించని వారికది వింత గొలిపింది.

మంత్రిగారి కారు ముందు కొన్ని కార్లు- వెనుక కొన్నికార్లు బార్లుగా వెళ్ళి అసలే ఆశ్చర్యంతో మునిగి తేలుతున్న వారిని నిలువునా ముంచింది!

ఫలితంగా, ఆ పల్లె జనం —

కారుల బారుల కిరుప్రక్కలా నిలబడి నిలువు గుడ్లేశారు !

కారుని దగ్గరగా చూడాలని ఆరాటంతో, ఆశతోవున్న ఒకతను కాస్త ముందుకు వెళ్ళగా- కాలు కారుక్రింద పడింది.

కాలు విరిగిపోగా, కుప్పకూలి పోయాడతను !

అంతలో—

అక్కడే బందోబస్తు చేస్తోన్న పోలీసు అధికారులు అతన్ని సమీపించి, కాలు విరిగిపోవడం చూసి, అవతలికి ఈడ్చారు!

ఇంకొక కారుకింద పడి చావకుండా అతన్ని అవతలికి ఈడ్చి రక్షించగలిగారు!

కానీ. ఎవరూ అతని మీద "జాలి" చూపించలేదు.

పైగా, "కళ్ళు నెత్తికెక్కేయేట్రా. ఏంవా?" అనన్నారు. ఇంకా యింకా ఏవేవో తిట్లు తిట్టేరు.

* * *

సభంతా "కల కల" లాడుతోంది!

అన్నం వేస్తే మెతుకు కిందపడితే— ఒట్టు !

అంత జనం !!

వేదికనుఅలంకరించేందుకై మంత్రిగారు లేచారు. మెట్లు ఎక్కుతూ ఆయాసపడుతోన్నారు.

అంతలోనే అడుగు తడబడి, కాలు మడతపడింది !

పరుగుతో మంత్రిగారిని చేరి చేయందించేరు రక్షణాధికారులు.

మంత్రిగారు మందహాసం చేశారు !

మరో అడుగు ముందుకు వేయబోయారు.

కాలు రాలేదు, సలుపు.... మంట....

మందహాసం మాయమై జాలిగా-కాలునీ, నేలనీ చూశారు!

ఆఫీసర్లు అమాంతంగా మంత్రిగారిని లేవనెత్తి కుర్చీలో కూలబెట్టి హడావిడిగా అటూ - యిటూ తిరిగారు!

తిరిగి - కేకలేసి - ఆజ్ఞలు జారీ చేసి- యేమిటేమిటో చేయసాగారు.

మెట్లు కట్టడంలో "ఫాల్టుం"దని కట్టినతన్ని తిట్టారు.

వేదిక సవ్యంగా లేదని అతన్నీ తిట్టారు.

తిట్టీ, అనంతరం- "తవరిలాటి పల్లెటూళ్ళకి రాడమే తప్పన్నారు!

అంత మంత్రి- 'బుద్ధి గడ్డితినే వొచ్చేను' అన్నట్టు ముఖం పెట్టేరు !

మంత్రిగారి నొప్పి యింకా తగ్గలేదు.

సభలోని 'గొర్రె మందల్ని' పొమ్మని చెప్పారు. (క్షమించాలి. ఈ సభలోని జనాలను ముందు గొర్రెల్నిచేసే యిక్కడికి రప్పించేరు. ఆ చుట్టు ప్రక్కల ఊళ్ళ నుంచి తోలుకొచ్చేరు. కనుక....)

చెప్పడమే ఆలస్యం కనుక వెంటనే చెదిరిపోయేరు !

మంత్రిగారిమీద విపరీతమైన 'జాలి'ని గుమ్మరిస్తోన్నారు !

కానీ, మంత్రిగారు మాత్రం తృప్తి పడ్డట్టులేదు !!!

